క్లుప్తంగా

రంగవల్లుల పోటీలు



పెద్దపల్లిరూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలోని జిల్లా గ్రంథాలయం ఆవరణలో మంగళవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సందేశాత్మకంగా వేసిన రంగవల్లులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప తదితరులు పరిశీలించారు. బుధవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయరమణారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

'వడ్లకు బోనస్ శుభపరిణామం'



మంథని: సన్న రకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించడం శుభపరిణామమని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పలుచోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిరికి ఆర్థికసాయం



జ్యోతినగర్: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సిరికి ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ.20 వేలు అందించారు. సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి సట్టు ముత్యాలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి



గోదావరిఖనిటౌన్: ఆర్టీసీ కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ.. డిపో మేనేజర్ నుంచి ఉన్నతాధికారుల వరకు కార్మికులపై పని భారం మోపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. నాయకులు నేర్వట్ల నర్సయ్య, టి.నరహరిరావు, రంగయ్య, శివకుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

మంథని: ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. మంగళవారం నాయకులతో కలిసి మంథని బస్ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్, నాయకులు సందీప్, సురేశ్‌బాబు, రవి తదితరులున్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేలు ఇవ్వండి'



జ్యోతినగర్: పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, జిల్లా మూడో మహాసభ గౌరవ అధ్యక్షుడు వై.యాకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అన్నపూర్ణకాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రామగుండంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని, స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 23, 24వ తేదీల్లో జ్యోతినగర్ ఏరియాలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించనున్న జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, రామాచారి, ఎ.ముత్యంరావు, భిక్షపతి, మల్లేశ్ తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి గ్రామాల్లో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల మీదుగా జమ్మికుంట, సుల్తానాబాద్ వెళ్లే పలు వాహనాలకు జరిమానా విధించారు.

నేడు దేవునిపల్లి నృసింహుని రథోత్సవం

- జైనుల కాలంనాటి ఆలయం
- కోర్కెలు తీర్చే స్వామివారిగా ప్రసిద్ధి
- లక్ష మందికి పైగా రానున్న భక్తులు





ప్రత్యేక అలంకరణలో స్వామివారు, శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ నెల 12 బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామివారికి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఆలయం జైనుల కాలం నాటిది. ఇక్కడి స్వామివారు కోరిన కోర్కెలు తీర్చే దేవునిగా ప్రసిద్ధి చెందారు. ఏటా కార్తీక మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి లక్ష మందికి పైగా భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు...

దేవునిపల్లి ఆలయ ప్రధాన ద్వారంతోపాటు ప్రహరీ నిర్మించారు. దాతలు ఇచ్చిన రూ.10 లక్షలు, దేవాదాయ శాఖ రూ.50 లక్షల నిధులతో ఆలయ ఆధునీకరణ పనులు సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ సమీపంలోని గుట్టపై వెలసిన మూలవిరాట్టు లక్ష్మీనృసింహ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పడుతున్న ఇబ్బందులను చూసి, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మెట్లు నిర్మించింది. మొత్తం 418 మెట్లు ఉంటే మార్గమధ్యలో సేదతీరేందుకు వీలుగా ఇటీవల అక్కడక్కడ షెడ్లు నిర్మించారు.

కంకర రోడ్డుపై కష్టాల ప్రయాణం

పెద్దపల్లి–గోదావరిఖని మార్గంలోని రాజీవ్ రోడ్డుపై అందుగులపల్లి స్టేజి వద్ద నుంచి దేవునిపల్లి ఆలయానికి చేరుకునే దారి అధ్వానంగా ఉంది. తారురోడ్డుగా మార్చాల్సి ఉన్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు, ప్రజలకు కంకర రోడ్డు కష్టాలు తప్పడం లేదు. వాహనాల రద్దీ పెరగడంతో విపరీతంగా దుమ్ము లేస్తోంది. ప్రస్తుతం ఆలయ కమిటీవారు ట్యాంకర్లతో నీళ్లు చల్లిస్తున్నారు.

అన్ని వసతులు కల్పించాం

లక్ష్మీనృసింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాం. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు, ఆలయ కమిటీవారు చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాం.

– శంకరయ్య, ఆలయ ఈవో

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



ధర్మారంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: దేశ మాజీ ప్రధాన మంత్రి, దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కమాన్‌పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నాయకులు మల్యాల తిరుపతి, అన్వర్, రంగు సత్యనారయణ, శేవ్వ శంకరయ్య, పిల్లి శేఖర్, భూంపెల్లి రాజయ్య, ముస్తాక్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఇంధిరాగాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్లు కాడె సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, కాంగ్రెస్ బ్లాక్–2 అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్, నాయకులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఇందిరాగాంధీ జయంతిని యైటింక్లయిన్‌కాలనీలోని తెలంగాణ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, కార్పొరేటర్ సాగంటి శంకర్, కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్‌రావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు పరకాల ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

ఓదెల: మడక గ్రామంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆవుల ముక్తేశ్వర్, కాంగ్రెస్ నాయకులు రవి, రాజేశం, మాధవరెడ్డి తదితరులున్నారు.

రామగిరి: సెంటినరీకాలనీ శ్రీపాదభవన్‌లో ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, నాయకులు పాల్గొన్నారు. ముత్తారం మండలంలోని కేశనపల్లిలో జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. నాయకులు శివకుమార్, రఫీ, శ్రీనివాస్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి 'దుద్దిళ్ల'ను ఎదుర్కోలేకే దుష్ప్రచారం

- హత్యా రాజకీయాలకు పుట్ట మధుకర్ మారుపేరు
- డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య



మాట్లాడుతున్న సమ్మయ్య

పాలకుర్తి: హత్యా రాజకీయాలకు పుట్ట మధుకర్ మారుపేరైతే, అభివృద్ధికి మారుపేరు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అని, అలాంటి వ్యక్తిపై నిరాధారణ ఆరోపణలు చేస్తే సహించేబోమని డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. మంగళవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుపై చేసిన ఆరోపణల వెనక జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ హస్తం ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. మామూలు కార్యకర్తగా ఉన్న నారాయణ రెడ్డి వందల ఎకరాల భూములను కబ్జా చేసి, రూ.కోట్లు గడించారని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో మంత్రిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక దుష్ప్రచారం చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు తలారి శంకర్, చిలగాని రాజేశం, వేల్పుల రాజ్‌కుమార్, బడుగు మహేందర్, సంపంగి కుమార్, బదావత్ శంకర్, షకలాల్, బాలగోని కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబులపై జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ నిరాధరణ ఆరోపణలు చేశారని, వారిపై చర్యలు కాంగ్రెస్ పాలకుర్తి మండల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, పార్టీ సీనియర్ నాయకుడు తొగరి తిరుపతిల ఆధ్వర్యంలో బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

సుల్తానాబాద్‌రూరల్: ధాన్యం కొనగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని పెద్దపల్లి డీసీపీ చేతన అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి, శాస్త్రీనగర్‌లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ధాన్యం రక్షణ, రైతులకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ఎస్సై శ్రవణ్‌కుమార్, పోలీసు, ఆయా కేంద్రాల సిబ్బంది తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రామగిరి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దని అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు. మంగళవారం కల్వచర్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా తహసీల్దార్ రాంచందర్‌రావు, ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. సుందిళ్ల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు చేశారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణు మంగళవారం తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ వాసంతి తదితరులున్నారు.

'డిప్యూటీ మేయర్‌పై ఆరోపణలు అర్థరహితం'



జ్యోతినగర్: రామగుండం డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుపై పలువురు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్ గౌడ్, కార్పొరేటర్లు ఎన్వీ.రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి అన్నారు. మంగళవారం ఎన్టీపీసీలో మాట్లాడారు. నాలుగో డివిజన్‌లో శివ కేశవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేపడుతుండగా ఆయన ఒక ప్రజాప్రతినిధిగా వెళ్లారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు పెట్రోల్ పోసి హత్యాయత్నం చేయడం, తనకు సంబంధం లేని విషయాలపై మరో నాయకుడు ఆరోపణలు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి

శ్రీ శివ కేశవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన ఆలయ నిర్మాణానికి అడ్డంకులు సృష్టించే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ట్రస్ట్ సభ్యులు కోరారు. ఆలయ స్థలం పక్కనే స్థలం ఉన్న శ్రీనివాస్ గుడి నిర్మాణాన్ని అడ్డుకోవడంతోపాటు డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావుపై పెట్రోల్ పోశాడన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సభ్యులు సాగర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, ముత్యాలు, వెంకటరెడ్డి తదితరులున్నారు.

రైతులతో వీసీలో మాట్లాడిన మంత్రి



వీసీలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఎలిగేడు: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో నిబంధనలు, సన్న వడ్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేయడం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. క్వింటాల్‌కు రూ.500 చొప్పున తమ ఖాతాల్లో జమయ్యాయని రైతులు బండ రమేశ్, మండల రవి, నరహరి నారాయణరెడ్డి మంత్రితో చెప్పారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి దోమ ఆదిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, డీసీవో శ్రీమాల, డీఎం సివిల్ సప్లయ్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి నివాళి



ధర్మారంలో నివాళి అర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

సుల్తానాబాద్: ఝాన్సీ లక్ష్మీబాయి ఆశయసాధనకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఆమె జయంతి నిర్వహించారు. లక్ష్మీబాయిని ఎంతోమంది స్త్రీలు స్ఫూర్తిగా తీసుకొని, స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకున్నారని తెలిపారు. వివేకానంద కళాశాల చైర్మన్ రవి, హాస్టల్స్ జిల్లా కన్వీనర్ రిషి, నాయకులున్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ డిగ్రీ కాలేజీ ఆవరణలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. జోనల్ ఇన్‌చార్జి దినేశ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు గణేశ్, శివకుమార్, శివనాథ్, ఉదయ్, వాసు తదితరులున్నారు.

ధర్మారం: మండల కేంద్రంలో ఏబీవీపీ ధర్మారం నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీభాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆకుల వంశీ, ఉపాధ్యక్షుడు జశ్వంత్, సంయుక్త కార్యదర్శి చందు, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని ఏబీవీపీ(ఎస్ఎఫ్ఎస్) జిల్లా కన్వీనర్ సందనవేని ఓమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం జూలపల్లిలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. తన రాజ్య ప్రజలను బ్రిటీష్‌వారి నుంచి కాపాడుకునేందుకు ప్రాణాలు తెగించి, పోరాడిందని గుర్తు చేశారు. నాయకులు అఖిల్, హరీశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలి

- కార్పొరేట్ కో–ఆర్డినేషన్ జీఎం సుభాని



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, అధికారులు

గోదావరిఖని: ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై అధికారులు, ఉద్యోగులు దృష్టిసారించాలని కార్పొరేట్ కో–ఆర్డినేషన్ జీఎం సుభాని సూచించారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా జీఎం లలిత్‌కుమార్, అధికారులు ఆయనకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో క్వాలిటీ రీజియన్ జీఎం బైద్య, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏజెంట్ రమేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కార్పొరేట్ కో–ఆర్డినేషన్ జీఎం సుభాని అన్నారు. మంగళవారం ఏరియాలోని బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక, రవాణాపై ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి తగిన ప్రణాళికలతో ముందుకెళ్లాలని, ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టు ప్రతినిధులతో మాట్లాడి, రవాణా, ఓబీ కాంట్రాక్టు ప్రతినిధులతో మాట్లాడి, ఓబీ వెలికితీత పెంచాలన్నారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, ఎస్‌వోటూ జీఎం రాముడు, అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ పొందినవారికి ధ్రువపత్రాలు అందజేత

సింగరేణి సామాజిక భాధ్యత స్వయం ఉపాధి కల్పనలో భాగంగా శిక్షణ పొందిన నిరుద్యోగ యువకులకు మంగళవారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక తిలక్‌నగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో 30 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఆర్క్ గ్యాస్ వెల్డింగ్‌లో రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా నెల రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, జీవీటీసీ మేనేజర్ అనిల్ కుమార్, ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్



గోదావరిఖని: సింగరేణి మహిళా ఉద్యోగులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 19 మంది బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు 16 డిజిగ్నేషన్ల గురించి వివరించారు. ఎంచుకున్న ఉద్యోగులకు శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎం రాముడు, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, మేనేజర్ భరత్‌కుమార్, రక్షణ అధికారి పాపయ్య తదితరులున్నారు.

క్వార్టర్ల కూల్చివేత నిలిపివేయాలి



గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో క్వార్టర్ల కూల్చివేత నిలిపివేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు రియాజ్‌అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం హెచ్ఎంఎస్ యూనియన్ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పేరిట రోడ్ల విస్తరణకు పూనుకున్న యాజమాన్యం ముందస్తు సమాచారం ఇవ్వకుండా క్వార్టర్ల కూల్చివేత చేపట్టడం సరికాదన్నారు. ఈ సందర్భంగా కార్మిక కుటుంబాలను కలిసి, సమస్యలు తెలుసుకున్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాములు, నాయకులు జక్కుల నారాయణ, ఇ.నరేశ్, ఆంజనేయులు, కృష్ణప్రసాద్, రత్నకుమార్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అభివృద్ధి చూపించండి?

గోదావరిఖని: గడిచిన ఏడాదిలో రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. చర్చించేందుకు ప్రధాన చౌరస్తాకు రావాలని సవాల్ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన దళిత మహిళా కార్పొరేటర్ల పట్ల సీఐ వ్యవహరించి తీరు సరికాదన్నారు. మహిళా నాయకులు విజయ, అంజలి, కవితసరోజని, సంధ్యారెడ్డి, కృష్ణవేణి, లత తదితరులున్నారు.

• రేపు గోదావరి మహా హారతి

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ గోదావరి నదీ తీరంలో గురువారం మహా హారతి నిర్వహించనున్నట్లు గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కో–కన్వీనర్ క్యాతం వెంకటరమణ తెలిపారు. మంగళవారం అంతర్గాం మండల కేంద్రంలో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు.

• 'మదర్ థెరిసా'లో వర్క్‌షాప్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో డేటా సైన్స్‌పై రిసోర్స్‌పర్సన్ హేమంత్‌కృష్ణ ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని, రాబోయే రోజుల్లో డేటాసైన్స్ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

• వైద్యుల సూచన మేరకే యాంటీబయాటిక్స్ వాడాలి

రామగిరి: రోగులు వైద్యుల సూచన మేరకే యాంటీబయాటిక్స్ వాడాలని మండల వైద్యాధికారి అమరేందర్‌రావు అన్నారు. మంగళవారం స్థానికులకు అవగాహన కల్పించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు.

• ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి



సుల్తానాబాద్: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల ముదిరాజ్ కమ్యూనిటీ హాల్లో ఈ నెల 21న నిర్వహించనున్న ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. దివంగత మాజీ సీఎం వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ముదిరాజ్‌లకు అన్నివిధాలా న్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అలాంటి చర్యలే తీసుకోవాలని కోరారు. రాష్ట్ర మాజీ డైరెక్టర్ గరిగంటి కుమార్‌బాబు, జిల్లా మాజీ డైరెక్టర్ కుందేళ్ల శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ నాయకులు బోయిని వినోద్, పసేద్ల రవీందర్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పూసాల ఉపాధ్యక్షుడు చొప్పరి శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

• సంకష్ట హర చతుర్థి పూజలు

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రాల్లోని గణపతి, హనుమాన్, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 21న సుల్తానాబాద్ శివాలయంలో శ్రీ వీరభద్ర స్వామి వారోత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

• విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ

పాలకుర్తి: జయ్యారం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ విద్యార్థులకు మంగళవారం స్వెటర్లు పంపిణీ చేశారు. చలికాలం దృష్ట్యా ప్రభుత్వం పంపించిన స్వెటర్లు, మంకీ క్యాప్‌లను అందించినట్లు వార్డెన్ సంపత్‌కుమార్ తెలిపారు.

• ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

జ్యోతినగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షుడు కె.యాదవరాజు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీలోని విశ్వభారతి హైస్కూల్లో మంగళవారం అమ్మ పేరిట మొక్క నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలు పంపిణీ చేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సంకల్ప యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయిశ్రీ, స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, స్వచ్ఛంద సంఘాల నాయకులున్నారు.

• విద్యార్థికి అభినందన

సుల్తానాబాద్: హైదరాబాద్‌లో గత ఆదివారం జరిగిన యూత్ రోలర్ స్కేటింగ్‌లో తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థి సంప్రీత్ బంగారు పతకం సాధించాడని ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్ మంగళవారం తెలిపారు. అతన్ని అభినందించారు.

• వరి కొయ్యలను కాల్చొద్దు

జూలపల్లి/రామగిరి: వరి కొయ్యలను కాల్చొద్దని జూలపల్లి ఏవో ప్రత్యూష, రామగిరి ఏవో శ్రీకాంత్ సూచించారు. మంగళవారం పొలాల వద్దకు వెళ్లి, రైతులకు పలు సూచనలు చేశారు. వరి కొయ్యలను కాల్చితే భూమిలో ఉండే భూకర్బన పదార్థం తగ్గి, మిత్ర పురుగులతోపాటు సూక్ష్మజీవులు నశించి, పంటలకు నష్టం జరుగుతుందని తెలిపారు. పొగతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. కొయ్యలను పొలంలోనే కలియదున్నితే భూసారం పెరిగి, అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

• 1న మాలల సింహగర్జనకు రండి

సుల్తానాబాద్: డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనకు రావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో–చైర్మన్ నల్లల కనకరాజు కోరారు. సంబంధిత కరపత్రాలను సుల్తానాబాద్ మండల కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మంగళవారం ఆవిష్కరించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి బొల్లం లక్ష్మణ్, రామగుండం కన్వీనర్ మద్దెల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

9న జేబీసీసీఐ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం

గోదావరిఖని: జేబీసీసీఐ 11వ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం వచ్చే నెల 9న నిర్వహిస్తున్నట్లు బీఎంఎస్ నాయకుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. రాయ్‌పూర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి కోలిండియాలోని అన్ని సంస్థలకు చెందిన అధికారులు, జాతీయ కార్మిక నాయకులు, సింగరేణి నుంచి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సివిల్ విభాగం జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. హైస్కిల్డ్‌లో పని చేస్తున్న వారికి సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించడం అన్యాయమన్నారు. నాయకులు అరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎంఏ.గౌస్, అశోక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.